సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి


పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అప్పటి వరకూ బంధువులతో సరదాగా, సంతోషంగా గడిచిన క్షణాలు అంతలోనే ఆవిరైపోయాయి. - 8లో▸




31 మందికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో శుక్రవారం 31 మందికి కోవిడ్ నిర్ధారణ అయింది. 227 మంది నుంచి నమూనాలు సేకరించగా ఈ ఫలితం వెలువడింది. బాధితులను హోం ఐసోలేషన్‌లో ఉంచారు.

సాగునీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.55 అడుగులకు చేరింది.



ఆన్‌షోర్..ఆఫ్‌షోర్..ఎనీవేర్..

- మహాసంద్రానికి అన్ని వైపులా సముద్ర దొంగలకు చెక్
- చమురు చోరీల నివారణకు ఉమ్మడి భద్రత
- ఆన్‌షోర్ ఆఫ్‌షోర్‌లలో జాయింట్ యాక్షన్
- ఓ వైపు కోస్ట్‌గార్డు, మరో వైపు పోలీస్ శాఖ

కాకినాడ క్రైం: ఆన్‌షోర్, ఆఫ్‌షోర్, ఎనీవేర్... ఇదీ చమురు దోపిడీలను నిలువరించేందుకు భద్రతా వ్యవస్థలు అనుసరిస్తున్న తాజా విధానం. సముద్ర ఉపరితలంపై కోస్టుగార్డు, తీర ప్రాంతాల్లో పోలీస్, ఎస్‌పీఎఫ్, మెరైన్ పోలీస్ తమ భద్రతా వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. సముద్ర భద్రత అంటే కోస్టు గార్డుకే పరిమితం అన్న స్థితిని దాటి తీర ప్రాంతాన్ని కూడా జల్లెడ పట్టి, జలాల్లో నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ తన అనుబంధ శాఖలతో కలిసి సమాయత్తమైంది. సముద్ర దొంగతనాలంటే సాధారణంగా చమురు కేంద్రంగా ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థనే శాసించే ప్రభావం ఉన్న చమురు ఉత్పత్తి నుంచి తరలింపు వరకు ప్రతి దశలోనూ పూర్తి స్థాయి భద్రత కల్పించేందుకు పేర్కొన్న వ్యవస్థలన్నీ ప్రత్యేక ప్రణాళికలతో శ్రమిస్తున్నాయి. ఆ వ్యూహాలను ప్రతిబింబించేలా కీలక సమావేశాలు, కార్యకలాపాలకు శ్రీకారం చుట్టాయి. ఈ ప్రక్రియలో భాగంగానే గురువారం వరకూ చేపట్టిన మాక్‌డ్రిల్ ప్రాధాన్యతను సంతరించుకుంది.

ముగిసిన సముద్ర జలశుద్ధి ప్రక్రియ

కాకినాడ తీరంలో అబ్బురపరిచే సముద్ర జల శుద్ధి మూడు రోజుల ప్రక్రియ ముగిసింది. ఇండియన్ కోస్టు గార్డు ఆధ్వర్యంలో కాకినాడ స్టేషన్ పరిధిలో యుద్ధ ప్రదర్శనను తలపించే రీతిలో రీజినల్ పొల్యూషన్ రెస్పాన్స్ ఎక్సర్‌సైజ్ పేరుతో భారీ మాక్ డ్రిల్ నిర్వహించారు. కాకినాడ కోస్టుగార్డు స్టేషన్ కమాండెంట్ ఆఫీసర్ జి.వేణుమాధవ్ సారథ్యంలో భారీ స్థాయిలో చేపట్టిన ఈ మాక్ డ్రిల్ సముద్ర జలాల్లో చమురు తెట్లను తొలగించే ప్రక్రియతో పాటు భద్రతా పరమైన అంశాలకు నిర్వహణకు ఓ ట్రయల్‌గా అధికారులు తెలిపారు.

అటు పోలీస్‌శాఖ...

కోస్టుగార్డుతో సహా అటు పోలీస్‌శాఖ సముద్ర తీర ప్రాంత అనుబంధంగా జరిగే చమురు దోపిడీలపై దృష్టి సారించింది. ఏకంగా రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ డీఐజీ పాలరాజు ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతాలు హద్దులుగా ఉన్న అన్ని జిల్లాల ఎస్పీలతో ఇటీవల రాజమహేంద్రవరంలో ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో జిల్లాల వారీగా చమురు చోరీల గణాంకాలపై చర్చించారని కాకినాడ జిల్లా పోలీస్ వర్గాలు తెలిపాయి. దొంగిలించి, తరలించేందుకు దొంగలు అనుసరిస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరుచుకున్నారు. పోలీస్ లేదా కోస్టుగార్డు అడ్డుకుంటే ఎదుర్కోవడానికి వారు వినియోగించే ఆయుధాలు, అవి వారికి సమకూరుతున్న పరిస్థితులపై చర్చించారు. ఈ నేపథ్యంలో చమురు దొంగతనాలకు పాల్పడ్డ పాత నిందితుల కదలికలపై నిఘా ఉంచాలని డీజీపీ ఎస్పీలను ఆదేశించారు. ఆయన ఆదేశాలమేరకు ఎస్పీలు యంత్రాంగాన్ని సమాయత్తపరిచారు.



చమురు తెట్టును చుట్టుముట్టడంపై ఆదేశాలిస్తున్న అధికారి. చిత్రంలో కమాండెంట్ వేణుమాధవ్, సిబ్బంది



చమురు దొంగతనాలపై అప్రమత్తం చేస్తూ తీరప్రాంత వాసులతో కాకినాడ మెరైన్ పోలీస్ అధికారుల సమావేశం

చమురు లీకైతే ...

చమురు తరలించే రెండు ఓడలు ప్రమాదవశాత్తు లేదా దాడుల నేపథ్యంలో సముద్రంలో ఢీకొట్టుకుంటే లేదా లీకేజీలు ఏర్పడితే జరిగే నష్టం సముద్ర జీవుల పట్ల ప్రాణసంకటమని కమాండెంట్ వేణుమాధవ్ తెలిపారు. లీకైన చమురు ఆక్సిజన్‌ను నీటిలోకి వెళ్లకుండా అడ్డుకుంటుందని అన్నారు. తద్వారా జీవాలు ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు. చమురు నీటి నుంచి వేరు చేసే ప్రక్రియకు భారీ జల, వాయు మార్గ సంపత్తితో పాటు అధునాతన పరికర సామర్థ్యాన్ని కోస్టుగార్డు వినియోగించింది. 97 మంది అధికారులు సిబ్బంది మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. వీరిలో 85 మంది సైలర్లు, 12 మంది అధికారులు ఉన్నారు.



మాక్‌డ్రిల్ విన్యాసం

రెండు విధాలుగా శుద్ధి...

చోరీలు జరిగినపుడు, ప్రమాదవశాత్తూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు, లేదా మరే కారణం వల్లనైనా భారీ పడవల నుంచి సముద్రంలోకి నేరుగా చమురు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చమురు తెట్లు ఏర్పడ్డ సముద్ర జలాల శుద్ధి ప్రక్రియను రెండు విధాలుగా చేపడతారు. ఆ రెండు విధానాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. చమురు తెట్టుకట్టిన ప్రాంతాన్ని చుట్టుముట్టి టీసీ-3 రసాయనాన్ని చల్లడం, ఈ క్రమంలో జరిగే రసాయనిక చర్య వల్ల ఆ చమురు సముద్రగర్భంలోకి చేరుతుంది. ప్రత్యేక ప్రక్రియ ద్వారా ఆ వ్యర్థాన్ని తిరిగి సేకరిస్తారు. అంతకుముందు నీటిలో చమురు వ్యాప్తిని నిలువరించేందుకు 'బూమ్'ను ప్రయోగించారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓడలు భారీ ట్యూబ్ వంటి ప్రత్యేక నిర్మాణంతో రూపొందించబడ్డ ఈ బూమ్‌ను చమురు తెట్టు చుట్టూ వృత్తాకారంగా ఏర్పాటు చేస్తాయి. అది దాటి తెట్టు వ్యాపించే ప్రసక్తే లేదు. ఇది కాక రెండవ విధానం భారీ బ్రష్ ద్వారా తెట్టును సేకరించడం. ఇది తక్కువ మొత్తంలో ఏర్పడ్డ చమురు తెట్లు తొలగించేందుకు అనుకూలం. ఈ రెండు ప్రక్రియలు జరుగుతున్నంత సేపూ నిశిత పరిశీలన, పర్యవేక్షణ కోసం 'ఏరియల్ రెక్కీ' నిర్వహించారు.

అద్భుత పనితీరు...



సముద్ర జలాల్లో అసాధారణ పరిస్థితులను ఎదుర్కోవడంతో నేర నియంత్రణను సాకారం చేసే క్రమంలో అన్ని వేళల్లోనూ అప్రమత్తంగా ఉంటాం. మాక్ డ్రిల్ పర్యావరణంపై మా బాధ్యత, చర్యలను ప్రతిబింబించే విధుల సమాహారం. ఈ ప్రదర్శన భారీ స్థాయిలో చేపట్టడంలో భద్రతా అంశాలను ప్రతిబింబించడం కూడా ఓ ఉద్దేశం. ఆ లక్ష్యంతోనే మాక్‌డ్రిల్‌కు గతంలో ఏనాడు వినియోగించని భారీ సంపత్తిని తీసుకొచ్చాం. అత్యంత సమర్థత ఉన్న సాంకేతికతనూ వినియోగించి ఎక్సర్‌సైజ్ నిర్వహించాం. ముఖ్యంగా చమురు దొంగతనాలను నిలువరించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం.

– జి.వేణుమాధవ్, కమాండెంట్ ఆఫీసర్, కాకినాడ కోస్టుగార్డు స్టేషన్

చమురు చోరీల నివారణకు కార్యాచరణ



చమురు చోరీల నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. రాష్ట్ర డీజీపీ ఆదేశాలు, డీఐజీ దిశానిర్దేశంలో ఈ చర్యలు కొనసాగుతున్నాయి. తాజా సమావేశంలో చమురు చోరీల నివారణ, భద్రత దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చమురు, గ్యాస్ సంస్థలకు భద్రత కల్పించడం, పైప్‌లైన్ల నుంచి పెట్రోలు, డీజిల్ దొంగిలిస్తున్న దొంగలను పట్టుకోవడం సంబంధిత దోపిడీలను అరికట్టడం ఇందులో కీలక అంశాలు. మెరైన్, కోస్ట్‌గార్డు పరస్పర సహకారంతో చమురు చోరీల నివారణ చర్యలకు సిద్ధమయ్యాం. త్వరలో ప్రత్యేక కార్యాచరణ, బృంద నియామకాన్ని ప్రకటిస్తాం.

– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, కాకినాడ జిల్లా

ప్రత్యేక భద్రత ఏర్పాటు



సముద్రంలో చోరీలు ముఖ్యంగా చమురు దొంగతనాలు నిలువరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా తీర ప్రాంత వాసులతో మమేకమవుతూ దొంగల కార్యకలాపాలు నిలువరించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఆయిల్ రిగ్‌ల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తున్నాం. ఫాస్ట్ ఇంటర్‌సెప్ట్ బోట్లు అందుబాటులో ఉన్నా నిరుపయోగంగా ఉండటం వల్ల మరిన్ని భద్రతా చర్యలు తీసుకోవడంలో చిన్నపాటి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వాటి మరమ్మతుల కోసం ఇప్పటికే విన్నవించాం.

– సుమంత్, మెరైన్ సీఐ

న్యూస్‌రీల్

రేపు ఎన్‌జీఓల సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సభ్యులందరూ సమావేశానికి విధిగా హాజరుకావాలని కోరారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్పందన కార్యక్రమానికి పలుమార్లు వస్తున్న అర్జీల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. ప్రణాళిక రంగంలో స్థిర అభివృద్ధి, ఆరోగ్య, స్త్రీ,శిశు సంక్షేమ పథకాలు, అమలు లక్ష్యాలు, పాఠశాల విద్య, స్పందన, సచివాలయ సేవలు, గడపగడపకూ మన ప్రభుత్వం అంశాలపై శుక్రవారం సాయంత్రం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్ భరత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేజ్ భరత్ మాట్లాడుతూ 7,55,271 కుటుంబాలకు గాను 5,42,502కు సంబంధించిన ఆరోగ్య డేటా ఎంట్రీ చేశామన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న 2,943 పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. 12,288 మంది గర్భిణులలో 116 మందికి తీవ్ర అనిమినియా ఉన్నట్లు గుర్తించామని, వీరిని వైద్య,ఆరోగ్య శాఖ అధికారుల ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వ కింద 512 సచివాలయ పరిధిలో 1,152 పనులు గుర్తించి, వాటిలో 1,106 పనులకు పరిపాలన ఆమోదం ఇచ్చామన్నారు. వాటిలో 997 పనులు ప్రారంభించినట్లు తెలిపారు. బడిబయట పిల్లలను 1,433 మందిని గుర్తించామని, స్కూళ్ల ప్రారంభానికి ముందే వారిని చేర్పించడం కోసం సచివాలయాల వారీగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం పేద, నిరుపేద పిల్లలకు సీట్లు కేటాయింపు విషయంలో ఇప్పటికే 440 స్కూళ్లకు గాను 349 స్కూళ్ల ఆప్షన్ ఇచ్చామన్నారు. వాటిలో 1,005 పిల్లలు రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి



స్వామివారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శుక్రవారం సుమారు 30 వేల మంది సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా. 1,500 వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం వ్రతాలు జమ్మిపత్రితో నిర్వహిస్తున్నారు. రూ.1500, రూ.రెండువేలు వ్రతాలు మినహ మిగిలిన వ్రతాలలో ఈ పత్రినే వాడుతున్నారు. సాధారణంగా మారేడు పత్రితో వ్రతాలు నిర్వహిస్తారు. వేసవిలో మారేడు చెట్లు ఆకులన్నీ రాల్చేసి చిగురుటాకులు వస్తాయని సంబంధిత సిబ్బంది తెలిపారు. జూన్ నాటికి ఆకులు పెద్దవై పత్రిగా ఉపయోగపడతాయని తెలిపారు. వేసవిలో సుమారు రెండు నెలలు మారేడు పత్రి బదుల జమ్మి పత్రిని వాడతామన్నారు. కాగా ఆలయం సమీపంలోని క్యూ మండపాంలోకి వచ్చేటప్పటికి గంట సమయం పడుతుంది. మండపంలో చల్లని మంచినీరు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. కుళాయి ఉన్నప్పటికీ ఆ నీరు ఎండకు వేడిగా మారిగిపోతున్నాయి. పెద్ద కుండలో చల్లని నీరు భక్తులకు సరఫరా చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అంబేడ్కర్ మార్గంలో జగన్ సుపరిపాలన

హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి భారతీయులందరికీ పండుగ రోజు అని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని కొవ్వూరులో ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానత్వంతో స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగాన్ని తీర్చిదిద్దిన ప్రదాత అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు ప్రాముఖ్యతనిస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. బస్టాండ్ సెంటర్, మెరకవీధి, 14వ వార్డు, శ్రీరామకాలనీల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు వనిత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్, పట్టణ గౌరవ అధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు పాల్గొన్నారు.



కొవ్వూరు మెరకవీధిలో అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న హోంమంత్రి వనిత



రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ భరత్‌రామ్



జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

దేశానికి మార్గదర్శకుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశానికి మార్గదర్శకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, డీఆర్‌ఓ నరసింహులుతో కలిసి పుష్పాంజలి ఘటించారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ నరసింహులు మాట్లాడుతూ న్యాయవాదిగా, గొప్ప విజ్ఞానవంతుడిగా, పేదల హక్కుల కోసం పోరాడిన యోధుడు అంబేడ్కర్ అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, కలెక్టరేట్ ఏవో జి.భీమారావు, డీఎస్‌వో పి.ప్రసాదరావు, డీఎల్‌డీవోలు పి.వీణాదేవి, వి.శాంతమణి, జిల్లా సర్వే అధికారి పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. అడిషనల్ ఎస్పీలు ఎం.రజనీ, సీహెచ్ పాపారావు, జి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.రామవర్మ, ట్రైనీ ఐపీఎస్ పంకజ్ కుమార్ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

17న వికాసలో జాబ్‌మేళా



కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఫెడరల్ బ్యాంక్‌లో ఏజెన్సీ లీడ్ మేనేజర్, ఏజెన్సీ లీడర్, కోజెంట్ ఈ-సర్వీసెస్‌లో బీపీఓ, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డి మార్ట్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ మేనేజర్, హుండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీడీ లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.10 వేలు నుంచి రూ. 25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈనెల 17న కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఉదయం 9 గంటలకు హాజరుకావచ్చన్నారు.

పట్టుదలతో ఒక్కో మెట్టు ఎక్కుతూ..

- మూడుఖండాల్లో పర్వతాల అధిరోహణ
- ఈనెల 20న ఎవరెస్ట్ ఎక్కేందుకు ప్రణాళిక
- రికార్డులు సాధిస్తున్న అంతర్జాతీయ టీటీ క్రీడాకారుడు ఆచంట ఉమేష్

రాజమహేంద్రవరం సిటీ: టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయి ఖ్యాతిని ఆర్జించి, పర్వతారోహణలో అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన రాజమహేంద్రవరానికి చెందిన ఉమేష్ ఆచంట మరో సాహసానికి సిద్ధమవుతున్నాడు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన శిఖరం ఎవరెస్ట్‌ను అధిరోహించేందుకు ఈనెల 20న సిద్ధమవుతున్నాడు. ఆచంట ఉమేష కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టీటీ క్రీడాకారుడిగా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని 500 పైగా పతకాలు, సర్టిఫికెట్లు సాధించాడు. ఒలింపిక్స్ లక్ష్యంగా పయనం సాగించాడు. 2016లో ఎవరెస్ట్ సినిమా చూసిన తర్వాత తన ఆలోచన విధానాన్ని మార్చుకున్నాడు. టీటీలో రాణిస్తూనే ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనే లక్ష్యం నిర్దేశించుకున్నాడు. ఆ విషయాన్ని తల్లిదండ్రుల వద్ద వెల్లడిస్తే వారు నిరాకరించారు. చివరకు వారిని ఒప్పించి 2016లో అరుణాచల ప్రదేశ్‌లో 45 రోజులు పర్వతారోహణకు శిక్షణ పొందాడు. 1996 సంవత్సరానికే టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవడంతో తపాలా శాఖలో 2010లో స్పోర్ట్స్ కోటాలో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. కాగా.. ఉమేష్ రాష్ట్రంలో ఇప్పటి వరకూ అరుదైన పర్వతారోహణ సాధించిన వ్యక్తుల్లో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొట్టమొదటి వ్యక్తిగా నమోదయ్యాడు.

లక్ష్య సాధన దిశగా..

ప్రపంచంలోని అతి ఎత్తయిన ఏడు పర్వతాలను అధిరోహించాలన్నదే ఉమేష్ లక్ష్యంగా చేసుకున్నాడు. 2021 మార్చిలో 19,340 అడుగుల ఎత్తు గల ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతాన్ని ఎనిమిది రోజుల వ్యవధిలో అధిరోహించాడు. అక్కడ భారత దేశ పతాకాన్ని ఎగుర వేశాడు. 2021 ఆగస్టులో 18,510 అడుగుల ఎత్తయిన యూరప్ ఖండంలో మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాన్ని 11 రోజుల్లో అధిరోహించాడు. 2022 నవంబర్‌లో ఆస్ట్రేలియాలో 7,310 అడుగుల ఎత్తుగల కోజిస్కో పర్వతాన్ని ఐదు రోజుల్లో అధిరోహించాడు. ఈనెల 20వ తేదీన ఆసియా ఖండంలో 29,030 అడుగుల ఎత్తుతో అతిపెద్దదైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు సిద్ధమవుతున్నాడు. దీనిని 56 రోజుల్లో ఎక్కాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఈ మేరకు 15 రోజుల పాటు భువనగిరిలో ప్రత్యేక శిక్షణ పొందాడు . ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే ప్రయాణం మొదలు పెడితే, తిరిగి జూన్ 6వ తేదీ నాటికి స్వస్థలం చేరుకుంటాడు. ఇటీవల ఢిల్లీకి చెందిన ప్రముఖ ఇంటర్నేషనల్ ఐకానిక్ 2023 సంవత్సరానికి గానూ అడ్వెంచర్స్ స్పోర్ట్స్ విభాగంలో ఉమేష్‌కు అవార్డును ప్రకటించింది.

ఆచంట ఉమేష్ విజయాలు

- 2019లో యూఎస్‌ఏలో బటర్‌ఫ్లై కప్ డివిజన్ బీ చాంపియన్
- 2019లో ఉమెన్ ఇంటర్నేషనల్ టీటీ టోర్నమెంట్‌లో ప్రైజ్
- 2021లో గోదావరి ఆణిముత్యం అవార్డు
- 2016లో ఆంధ్రరత్న అవార్డు
- మూడుసార్లు వ్యక్తిగత స్టేట్ చాంపియన్
- మూడుసార్లు యూనివర్సిటీ చాంపియన్
- రెండుసార్లు స్టేట్ చాంపియన్ ఇన్ టీమ్‌ఈవెంట్
- 16 సార్లు స్టేట్ నెం1 ర్యాంకింగ్ టోర్నమెంట్స్
- 28 సార్లు స్టేట్ నెం 2 ర్యాంకింగ్ టోర్నమెంట్స్
- ఆలిండియా సివిల్ సర్వీసెస్ బ్రాంజ్ మెడల్
- 12 ఆలిండియా మెడల్స్ సాధన
- 7 ప్రపంచ రికార్డుల సాధన



అతిపెద్ద జాతీయ జెండాను ఎగురవేసిన ఉమేష్



సాధించిన బహుమతులతో ఉమేష్



అంతర్జాతీయ అవార్డును హోంమంత్రి తానేటి వనితకు చూపిస్తున్న ఉమేష్



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఉమేష్

ఏడు సమ్మిట్స్ పూర్తి చేస్తా

పర్వతారోహణ మొదలు పెట్టక పూర్వం ఒలింపిక్స్‌లో విజేతగా నిలవాలన్న సంకల్పం ఉండేది. 2016 నుంచి ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలనే లక్ష్యం ఏర్పడింది. ప్రపంచంలోని ఏడు సిమ్మిట్స్ అధిరోహించాలన్నదే ఆశయం. తల్లిదండ్రులు బాలాజీ, పద్మావతి, కోచ్ కేవీ సూర్యప్రకాష్ సహకారంతో ఎవరెస్ట్‌ను అధిరోహిస్తా. ఇందుకోసం రూ.35 లక్షల వరకూ ఖర్చవుతుంది. ఇప్పటికే 11000 యూఎస్ డాలర్లు నేపాల్ ప్రభుత్వానికి చెల్లించాను. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కోరాను. ప్రభుత్వం సహకరిస్తే 20వ తేదీన నేపాల్ నుంచి ఎవరెస్ట్ అధిరోహించే ప్రయత్నం ప్రారంభిస్తా.

– ఉమేష్, టీటీ క్రీడాకారుడు, పర్వతారోహకుడు

పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి

- గోదావరిలో స్నానానికి దిగి,
- ముగ్గురి గల్లంతు
- దొరకని ఆచూకీ
- రెండు గ్రామాల్లో విషాద ఛాయలు


పితాని రాజేంద్ర (పాత చిత్రం)


కొప్పిశెట్టి సాయి రామ్ (పాత చిత్రం)


మట్టపర్తి రాజేంద్ర (పాత చిత్రం)


సురక్షితంగా బయటబడిన వారి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ దుర్గారావు, ఎస్సై చిరంజీవి

కె.గంగవరం: పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అప్పటి వరకూ బంధువులతో సరదాగా, సంతోషంగా గడిచిన క్షణాలు అంతలోనే ఆవిరైపోయాయి. వేర్వేరు గ్రామాలకు చెందిన ఆరుగురు గౌతమీ గోదావరిలో స్నానం చేస్తుండగా ముగ్గురు గల్లంతైన ఘటన వారి కుటుంబ సభ్యులకు విషాదాన్ని పంచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామం వద్ద ఈ ఘోరం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. మండలంలోని పామర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిరామ్ (24) పుట్టిన రోజు శుక్రవారం. ఈ సందర్భంగా బంధువులైన మట్టపర్తి ఆనంద్ (32), కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన పితాని రాజేంద్ర(25), వనుము శివనారాయణ, కొప్పిశెట్టి దొరబాబు (శంకర్), కొప్పిశెట్టి గోవిందుతో కలసి సాయిరామ్ కూళ్ల గ్రామంలోని గౌతమీ గోదావరి తీరానికి వెళ్లాడు.

సుడుల్లో ఈదలేక..

రామచంద్రపురంలో మధ్యాహ్నం బిర్యానీ తీసుకుని ఈ ఆరుగురూ కూళ్ల గ్రామానికి రెండు గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అనంతరం అందరూ బిర్యానీ తిని, పార్టీ చేసుకున్నారు. నాలుగు గంటల ప్రాంతంలో గోదావరి నదిలో స్నానానికి దిగారు. అప్పటి వరకూ గోదావరి లోతు తక్కువగా ఉండటంతో నడుచుకుంటూ పక్కనే ఉన్న తిప్ప వరకూ వెళ్లారు. అక్కడ కొంతసేపు ఉండి, తిరిగి రావడానికి బయలుదేరారు. ఆ సమయంలో గోదావరి ఉధృతి పెరిగిందని భావించి, వచ్చిన దారిలో కాకుండా వేరే మార్గంలో ఈత కొడుతూ బయలుదేరారు. మధ్యలోకి వచ్చేసరికి గోదావరిలో సుడులు ఉండటంతో ఈదలేక సాయిరామ్, ఆనంద్, రాజేంద్ర గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురిలో ఒకరు ఒడ్డున ఉండగా ఇద్దరు సుడుల్లో కొట్టుకుపోతూనే పరస్పరం సాయం చేసుకుంటూ సురక్షితంగా బయట పడ్డారు. సాయిరామ్, ఆనంద్, రాజేంద్ర గల్లంతయ్యారని స్థానికులకు, బంధువులకు వారు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ దుర్గారావు, ఎస్సై కె.చిరంజీవి సంఘటన స్థలానికి చెరుకున్నారు. సురక్షితంగా బయటపడిన వారి నుంచి వివరాల సేకరించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

విషాదంలో కుటుంబ సభ్యులు

గల్లంతైన వారిలో కొప్పిశెట్టి సాయిరామ్ కాకినాడ హెరిటేజ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులకు అతడు ఒక్కగాక ఒక్క కుమారుడు. రాజేంద్ర తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వారికి ఇద్దరు సంతానం. రాజేంద్ర వేళంగి గ్రామంలో కేబుల్ వర్క్ చేస్తున్నాడు. ఈ ఘటనలో గల్లంతైన మట్టపర్తి ఆనంద్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి వివాహమైంది. భార్య ఏడు నెలల గర్భిణి. సాయి, ఆనంద్ గల్లంతుతో పామర్రులో విషాద ఛాయలు అలముకున్నాయి. మరోవైపు వేళంగి గ్రామంలో పని చేసుకుంటూ నడకుదురులో నివాసం ఉంటున్న రాజేంద్ర కుటుంబంలో కూడా విషాదం అలముకుంది.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్ ఘనపాఠి, సుధీర్, చిట్టెం వాసు, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 38 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట శ్రీను ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

క్లుప్తంగా

డాక్టర్ గన్నికి అరుదైన గౌరవం


తాష్కెంట్ సదస్సులో ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఇస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చీఫ్ మెంటర్, సర్జన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు అరుదైన గౌరవం లభించింది. ఉజ్బెకిస్తాన్‌లోని బుఖారా రాష్ట్రం 'అబూ అలీ ఇన్ సైనో' వైద్య సంస్థకు గౌరవ డాక్టర్‌గా, తాష్కెంట్ మెడికల్ అకాడమీలో గౌరవ ప్రొఫెసర్‌గా ఆయన నియమితులయ్యారు. వైద్య రంగంలో అంతర్జాతీయ సహకారం కోసం మధ్య ఆసియాలోని ఉజ్బెకిస్తాన్ వైద్య, ఆరోగ్య శాఖ తాష్కెంట్‌లో మూడు రోజుల పాటు సమావేశం నిర్వహించింది. ఇందులో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియపై డాక్టర్ గన్ని గురువారం ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బుఖారా వైద్య సంస్థ ఎంపిక చేసిన వారికి సర్జికల్ అంకాలజీ, నెక్ అండ్ హెడ్ సర్జరీలు రోబోటిక్ సర్జరీలు, మెడికల్ సిమ్యులేషన్, నర్స్ ట్రైనింగ్‌లో జీఎస్ఎల్ విద్యా సంస్థలు శిక్షణ ఇస్తారని డాక్టర్ గన్ని శుక్రవారం తెలిపారు. విజ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకునే విధానంపై జీఎస్ఎల్ ఇప్పటికే పలు దేశాల్లోని వైద్య విశ్వవిద్యాలయాలతో ఒడంబడికలు చేసుకుంది. తాజాగా ఉజ్బెకిస్తాన్‌లోని రెండు యూనివర్సిటీలతో కూడా జీఎస్ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది.

క్యాన్సర్‌పై అధ్యయనాలకు అంతర్జాతీయ గుర్తింపు


ఎన్‌సీసీఎన్ సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ తరుణ్

రాజానగరం: క్యాన్సర్‌పై జీఎస్ఎల్ అంకాలజీ విభాగం చేస్తున్న అధ్యయనాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. నేషనల్ కాంప్రహెన్సివ్ క్యాన్సర్ నెట్‌వర్క్ (ఎన్‌సీసీఎన్) అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించిన 2023 వార్షిక సమ్మేళనంలో క్యాన్సర్‌పై జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి అంకాలజిస్టు డాక్టర్ గోగినేని తరుణ్ రూపొందించిన రెండు మెడికల్ పోస్టర్లకు గుర్తింపు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీల వద్దకే వెళ్లి, క్యాన్సర్ పరీక్షలు చేయడంలో సమస్యలపై అనేక మంది వైద్యులు ఈ సమ్మేళనంలో వివరించారు. మన దేశం నుంచి ఏకైక ప్రతినిధిగా డాక్టర్ తరుణ్ ఒక్కరే హాజరయ్యారు.

బాలల అక్రమ రవాణాకు బ్రేక్


రైల్వేలో అక్రమంగా రవాణా అవుతున్న పిల్లలను రక్షించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది

- కోయంబత్తూరు, చెన్నైకి తరలిస్తుండగా అడ్డుకున్న ఆర్‌పీఎఫ్ దళాలు
- విశాఖ వసతి గృహానికి 15 మంది పిల్లల తరలింపు
- అందరూ ఒడిశా, బిహార్, జార్ఖండ్ వాసులు

రాజమహేంద్రవరం సిటీ: బాలల అక్రమ రవాణాకు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది అడ్డుకట్ట వేశారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమై, 15 మంది బాల బాలికలను రక్షించారు. ఆర్‌పీఎఫ్ అదనపు సెక్యూరిటీ కమిషనర్ ఎంఎస్ చౌహాన్ కథనం ప్రకారం.. ఒడిశా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 14 నుంచి 17 ఏళ్ల వయస్సున్న బాల బాలికలను తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూర్‌లకు అక్రమంగా తరలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందింది. జార్ఖండ్‌లోని జసీడీహ్ జంక్షన్ నుంచి చెన్నైలోని తాంబరం మధ్య నడుస్తున్న 12376 వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో 15 మంది బాలబాలికలను రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఆ రైలు శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకోగానే ఆర్‌పీఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. బాలలను రక్షించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. ఆ కమిటీ ఆదేశాల మేరకు ఆ పిల్లలను తాత్కాలిక వసతి కోసం విశాఖపట్నంలోని ప్రభుత్వ బాలల వసతి గృహానికి తరలించారు. తగు ఆధారాలతో వచ్చిన తల్లిదండ్రులకు ఆ పిల్లలను తిరిగి అప్పగించనున్నారు. బాలల అక్రమ రవాణాపై ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాలల అక్రమ రవాణా చట్ట వ్యతిరేకమని, దీనికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చౌహాన్ హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్టు రైలు ప్రయాణికులు ఎక్కడైనా గమనిస్తే రైల్వే టోల్ ఫ్రీ నంబర్ 139కి ఉచితంగా ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, ఎస్సైలు నవీన్, లక్ష్మి, సిబ్బంది శ్రీకాంత్, జిలానీ, శ్రీనివాసరావు, రవికుమార్, ప్రకాష్, శ్రీరామ్, హేమ్‌సింగ్ పాల్గొన్నారు.

దేవస్థానం భూముల పరిశీలన


గొందిలో భూములను పరిశీలిస్తున్న ఈఓ ఆజాద్, ఏసీ రమేష్ బాబు తదితరులు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానానికి వివిధ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములను ఆలయ ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం పరిశీలించారు. దేవస్థానానికి కాకినాడ రూరల్ మండలంలోని తిమ్మాపురంలో 40.15 ఎకరాలు, శంఖవరం మండలం గొంది గ్రామంలో 34.33 ఎకరాలు, చెందుర్తిలో హైవేను ఆనుకుని 150 ఎకరాలు , సంపర గ్రామంలో 75 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను ఈఓ చంద్రశేఖర్ అజాద్ పరిశీలించారు. వీటిలో ఏయే పంటలున్నాయి, కౌలు ఎంత వస్తుంది తదితర విషయాలను అధికారులు ఈఓకు వివరించారు. మిగిలిన గ్రామాల్లోని భూములను కూడా ఆయన శని, ఆదివారాల్లో పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. ఈ నెల 18న దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయాల భూముల వివరాలపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈఓ ఈ భూములు పరిశీలించినట్టు తెలిపారు. దేవస్థానం ఏసీ రమేష్ బాబు, సూపరింటిండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

స్తంభంపై ఉండగా విద్యుత్ షాక్


ధర్మేంద్ర కుమార్ మృతదేహం


ధర్మేంద్ర కుమార్ పడిపోయింది ఈ స్తంభం పైనుంచే

- కింద పడి అసిస్టెంట్ లైన్‌మన్ మృతి
- ద్వారకా తిరుమలలో ఘటన
- మృతుడు నల్లజర్ల వాసి

ద్వారకా తిరుమల: విద్యుత్ షాక్‌తో స్తంభం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన ఒక అసిస్టెంట్ లైన్‌మన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ద్వారకా తిరుమల వీఆర్ఎం ఫంక్షన్ హాలు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పాతూరి ధర్మేంద్ర కుమార్ (44) ద్వారకా తిరుమల మండలం రాళ్లకుంటలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా, ద్వారకా తిరుమలలో ఇన్చార్జి అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగ రీత్యా కొన్నాళ్లుగా అతడు మండలంలోని గొల్లగూడెంలోని ఒక అద్దె ఇంట్లో భార్య రాధికతో కలసి నివాసం ఉంటున్నాడు. మృతుడి ఒక్కగానొక్క కుమారుడు సాయి సత్యకృష్ణ బెంగళూరులో బీటెక్ (ఈసీఈ) మూడో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఒక ఇంటికి కరెంటు సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతుల నిమిత్తం ధర్మేంద్ర కుమార్ సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని ఘటనా స్థలంలోని విద్యుత్ స్తంభం ఎక్కాడు. తెగిపోయిన ఎర్త్ వైర్ బిగిస్తుండగా.. సంబంధిత ఇంట్లోని ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా రివర్స్ వచ్చింది. దీంతో అతడు విద్యుత్ షాక్‌కు గురై, ఒక్కసారిగా స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు హుటాహుటిన ద్వారకా తిరుమల పీహెచ్‌సీకి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న ధర్మేంద్ర కుమార్‌ను ప్రథమ చికిత్స అనంతరం, 108లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి


ప్రమాద స్థలంలో కొండయ్య మృతదేహం

కొవ్వూరు: ట్రాక్టర్ అదుపు తప్పి, డ్రైవర్ మృతి చెందిన ఘటన ఐ.పంగిడి గ్రామ సమీపాన చోటు చేసుకుంది. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం దండగర్రు గ్రామానికి చెందిన ఎలిగంటి కొండయ్య (47) శుక్రవారం ఉదయం ఐ.పంగిడి సమీపంలోని ఒక క్రషర్‌లో మెటల్ లోడ్ వేసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న సత్రు గుట్ట పైకి ఎక్కడంతో ట్రాక్టర్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కొండయ్య పట్టు తప్పి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు ఎక్కేయడంతో కొండయ్య అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దండగర్రు గ్రామానికి చెందిన చిక్కాల మురళి వద్ద కొండయ్య ఏడేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడి సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంట కాలువలో పడి సైక్లిస్ట్ మృతి

పి.గన్నవరం: ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి ఒక సైక్లిస్టు మృతి చెందాడు. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలేనికి చెందిన సూదా ఏసుప్రసాద్ (52) అంబాజీపేటలోని కొబ్బరి కొట్టులో కార్మికునిగా పని చేస్తున్నాడు. రోజూ ఉదయం సైకిల్‌పై అంబాజీపేట వెళ్లి, పనులు ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తూంటాడు. ఇదేవిధంగా గురువారం రాత్రి అంబాజీపేట నుంచి ఆదిమూలంవారిపాలెం బయలుదేరిన ఏసుప్రసాద్ ఇంటికి చేరలేదు. అంబాజీపేటలోని కొబ్బరి కొట్టు వద్దే ఉండిపోయాడని అతడి కుటుంబ సభ్యులు భావించారు. అయితే, రాత్రి కావడంతో ఏసుప్రసాద్ యర్రంశెట్టివారిపాలెం వద్ద ప్రమాదవశాత్తూ సైకిల్‌తో సహా పంట కాలువలో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. శుక్రవారం ఉదయం గమనించిన గ్రామస్తులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఏసుప్రసాద్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు సాయిరామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

సామర్లకోట: తాగిన మైకంలో తల్లితో ఘర్షణకు దిగిన ఓ వ్యక్తి కింద పడి, గాయపడి, మృతి చెందిన సంఘటన స్థానిక బలుసులపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అప్పటికే తాగిన మైకంలో ఉన్న వడ్డే ప్రసాద్ (35) మరింతగా మద్యం తాగేందుకు తల్లి శాంతికుమారిని డబ్బులు అడిగాడు. నిరాకరించిన తల్లితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో అతడి తలకు బలమైన గాయం తగిలింది. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రసాద్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు


గంజాయి, నిందితుడితో ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్కూటర్‌లో గంజాయిని తరలిస్తున్న ఓ యువకుడిని ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామానికి చెందిన దేగల సంజీవకుమార్ అక్కడి శతాబ్ది డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతూ మధ్యలోనే మానేశాడు. గంజాయి బాట పట్టాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి నుంచి స్కూటర్‌పై గంజాయి తీసుకువస్తూ కొన్నాళ్లుగా ఆ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఇదే విధంగా గంజాయి తరలిస్తూ ఎస్ఈబీ పోలీసులకు చిక్కాడు. సంజీవకుమార్ నుంచి మూడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ తెలిపారు.

మృత్యు శకటం


ప్రమాద స్థలంలో బాధితులు

- బైక్‌ను ఢీకొన్న లారీ
- లిఫ్ట్ అడిగి ఎక్కిన మహిళ దుర్మరణం
- మోటార్ సైక్లిస్టుకూ గాయాలు
- దివాన్‌చెరువు వద్ద ఘోరం

రాజానగరం: భర్త సంపాదన పైనే ఆధారపడిన కుటుంబానికి ఎంతో కొంత ఆసరాగా ఉందామనే ఉద్దేశంతో మగ్గం వర్కు నేర్చుకుని, సర్టిఫికెట్ తీసుకునేందుకు ఉత్సాహంగా వెళ్తున్న ఒక వివాహిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. ఆ కుటుంబాన్ని కన్నీటి సంద్రంలో ముంచి, కనుమరుగైపోయింది.

జాతీయ రహదారిపై దివాన్‌చెరువు పెట్రోలు బంకు సమీపాన శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన మండపాటి నాగేశ్వరరావు రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు రాజానగరంలోనే మకాం ఉంటూ రోజు విధులకు వెళ్లి వస్తూంటాడు. భర్త సంపాదనకు తాను కూడా తోడు కావాలనే ఉద్దేశంతో అతడి భార్య మాధవి (28) దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కులో ఉచిత శిక్షణ పొందింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ల ప్రదానం శుక్రవారం ఉండటంతో ఇంటి నుంచి భర్తతో కలిసి బయలుదేరింది. జీఎస్ఎల్ వద్దకు వచ్చేసరికి తాను ఆసుపత్రిలో వేలిముద్ర వేయాల్సి ఉందని భర్త నాగేశ్వరరావు చెప్పాడు. ఆమెను రోడ్డు పైనే వదిలేసి, లోపలకు వెళ్లాడు. అదే సమయంలో రాజానగరం నుంచి ప్రసాద్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నాడు. తమకు తెలిసున్న వ్యక్తే కావడంతో అతడిని మాధవి లిఫ్ట్ అడిగింది. అతడి బైక్‌పై దివాన్ చెరువు వెళ్తుండగా పెట్రోలు బంకు సమీపాన వెనుక నుంచి అత్యంత వేగంతో వచ్చిన లారీ వారిని ఢీకొంది. కొంత దూరం వారిని, బైక్‌ను ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మాధవి రెండు కాళ్లూ నుజ్జునుజ్జయిపోయాయి. కొన ఊపిరితో ఉన్న ఆమె రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు లిఫ్ట్ ఇచ్చిన ప్రసాద్ కోలుకుంటున్నాడు. సంఘటన స్థలానికి ఫర్లాంగు దూరంలోనే డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఉంది. ఐదు నిమిషాల్లో అక్కడికి చేరుకుని, మగ్గం వర్కులో సర్టిఫికెట్ తీసుకోవలసిన మాధవి ఇలా దుర్మరణం పాలవడం తమను ఎంతగానో కలచివేసిందని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు కన్నీటి పర్యంతమయ్యారు, మృతురాలికి భర్త, ఐదేళ్ల లోపు వయస్సున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

అన్నవరం: రత్నగిరిపై అర్చకులు, వ్రతపురోహితులకు దేవదాయ, ధర్మాదాయశాఖ, అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభలో దేవస్థానం ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, అర్చక ట్రైనింగ్ అకాడమీ చీఫ్ కో ఆర్డినేటర్ డీవీఎం చక్రవర్తి, ద్వారకాతిరుమల ఆస్థాన సిద్ధాంతి పైతపల్లి బాలసుబ్రహ్మణ్య శర్మ, దేవదాయశాఖ ఆగమ సలహాదారు చిర్రావూరి శ్రీరామశర్మ పాల్గొని అర్చకులకు పలు సూచనలు చేశారు. శిక్షణ పొందిన పురోహితులు, అర్చకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు ముత్య సత్యనారాయణ, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.